సీడ్ పత్తి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

గద్వాల, జూన్ 13 : సీడ్ పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం, కంపెనీలపై నియంత్రణతో పాటు రైతుల హక్కులను బలపరిచే కొత్త విత్తన చట్టం త్వరలో అమలులోకి రానుందని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన సీడ్‌పత్తి పంటకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు, రైతుల సమస్యల పరిష్కారానికి అభిప్రాయ సేకరణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, రైతుల ప్రతినిధులు, సీడ్‌ఆర్గనైజర్స్, కంపెనీల ప్రతినిధులు వారి వారి అభిప్రాయాలను కమిషన్‌కు వివరించారు. అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లాలో పత్తి రైతుల సమస్య తీవ్రంగా ఉండడంతో కమిషన్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలు నేరుగా తెలుసుకోవడానికి ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కంపెనీల, ఆర్గనైజర్ల వల్ల రైతులు విత్తనాలు ఫెయిల్, అధికవడ్డీరేట్లతో అప్పుల్లో కూరుకపోతూ ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తీవ్రంగా బాధించేదిగా ఉందని తెలిపారు. రైతులకు శాశ్వత రక్షణ కోసం కొత్త విత్తన చట్టాన్ని ప్రభుత్వం 20రోజుల్లో తీసుకరాబోతుందని, ఇది విత్తన కంపెనీలపై నియంత్రణతోపాటు రైతుల హక్కులకు రక్షణ కల్పించనుందని చెప్పారు. గద్వాలలో విత్తనాల నాణ్యత, సరఫరా, కంపెనీల బాధ్యతపై స్పష్టత ఉండేందుకు రైతులకు మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా కంపెనీలతో సంబంధం పెట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వడ్డీ వ్యాపారం చేసి మనీ లెండర్లు లైసెన్స్‌తో ఆర్బీ నిబంధనల మేరకు వ్యవహరించాలని, లావాదేవిలపై కాలానుగుణంగా ఆడిట్ జరపాలని అధికారులకు ఆదేశించారు. ఆర్గనైజర్లు రైతుల వద్ద తమ విస్వనీయతను కోల్పోతున్నారని రైతులుంటేనే ఆర్గనైజర్లు ఉంటారనే సత్యాన్ని గ్రహించాలని సూచించారు. నష్టపోయిన రైతులకు చేయూత నివ్వాలని కంపెనీలకు, ఆర్గనైజర్లకు సూచించారు. కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ సీడ్ పత్తి సాగు చేసే రైతులు ఆర్గనైజర్లపై నమ్మకం లేకపోవడం వల్లే అందరికీ నష్టం జరుగుతుందన్నారు. సమావేశంలో మరో కమిటీ సభ్యులు సునీల్, కలెక్టర్ సంతోష్ మాట్లాడారు. అంతకు ముందు కంపెనీలు, ఆర్గనైజర్లు రైతులను ఎలా మోసం చేస్తున్నారో రైతు కమిషన్ చైర్మన్‌కు నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ గొంగళ్ల రంజిత్‌కుమార్, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు నాగర్‌దొడ్డివెంకట్రాములు, కుర్వపల్లయ్య, ఆంజనేయులు, వెంకటస్వామి, నర్సింహ తదితరులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు రాము, లవన్న, తిమ్మప్ప, రమేశ్ తమ విత్తనాలు పాస్ అయినా ఫెయిల్ అయినట్లు ఆర్గనైజర్లు చెప్తున్నారని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఏవో గోవింద్‌నాయక్, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కమిటీ సభ్యులు భవాని, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాములునాయక్, గంగాధర్, ఆర్డీవో అలివేలితోపాటు ఆర్గనైజర్లు, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చిత్రంలో కలెక్టర్ సంతోష్

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

తాడిపర్తిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, జూన్ 13 : మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సందీప్ తండ్రి శ్రీశైలం వారం రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన బీఆర్ ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రాజు నానమ్మ పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుద్ధారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పలుస కృష్ణయ్యగౌడ్ సోదరుడు నాగయ్యగౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం మృతుల కుటుంబాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొల్లెద్దుల బాల్‌రాజు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వెంకటయ్య నాయకులు మణ్యం నాయక్, శంకరయ్య, నాగరాజు, శ్రావణ్‌కుమార్, పూల్యానాయక్, రవి, రాందాస్, కృష్ణయ్య, మహేశ్, శివకుమార్, లచ్చగౌడ్, ఓంకార్, రాజు ఉన్నారు.

రైతులు పెద్ద మనసుతో సహకరించాలి

- ఆర్డీవో సుబ్రహ్మణ్యం

ఖిల్లాఘణపురం, జూన్ 13 : గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు పెద్ద మనసుతో సహకరించాలని వనపర్తి ఆర్డీవో సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇరిగేషన్ అధికారి, సర్వేయర్‌తో కలిసి గణప సముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గణప సముద్రం రిజర్వాయర్ పూర్తి నిర్మాణానికి 603.46 ఎకరాల భూమి అవసరం ఉందని ఇందులో 388 ఎకరాలు గణప సముద్రం చెరువు లోపల శిఖం పట్టాలు ఉన్నట్లు చెప్పారు. శిఖం పట్టాలు కలిగిన వారు చెరువులో నీరు లేనప్పుడు మాత్రమే ఒక పంట వేసుకోవడానికి అవకాశం ఉంటుందని, మొత్తం 603.46 ఎకరాల్లో 991మంది రైతులు ఉండగా ఇప్పటికే 251మంది రైతులు భూమి ఇచ్చేందుకు అంగీకారం తెలిపి అవార్డులు తీసుకున్నారన్నారు.

మిగిలిన 740మంది రైతులు కూడా అంగీకరిస్తే గణపసముద్రం రిజర్వాయర్ పూర్తవుతుందని తద్వారా 5,200 ఎకరాలకు సాగు నీరు అందించవచ్చన్నారు. భూమి కోల్పోతున్న రైతులకు అక్కడి మార్కెట్ విలువ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.11 లక్షల నుంచి రూ.12లక్షల పరిహారం అందుతుందని వెల్లడించారు. సమావేశంలో డీఈ నరేదంర్‌రెడ్డి, సర్వేయర్, ముంపు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

- తూకం వేసి 15 రోజులైనా తరలించని వైనం
- బాధిత రైతుల్లో మార్కెట్ డైరెక్టర్ కూడా..

రాంపురంలో తడిచిన ధాన్యం బస్తాలు

పెబ్బేరు, జూన్ 13 : ధాన్యం కొనుగోళ్లలో ఇంకా గందరగోళం తొలగలేదు. కోతలు, కొనుగోళ్లు చివరి దశకు వచ్చినా అధికారులు మొద్దు నిద్రను వీడడం లేదు. ఈ దఫా రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు మొదటి నుంచి భగీరథ ప్రయత్నాలే చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆర్భాటంగా వరి ధాన్యం కొ నుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్పటికీ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయలేక పోయింది. దీంతో అన్నదాతలు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రస్తుతం వానకాలం ప్రారంభమైనా కొనుగోళ్లలో అదే నిర్లక్ష్యం కనబడుతోంది. పెబ్బేరు మండలం రాంపురంలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యా న్ని తూకం వేసి 15 రోజులవుతున్నా ఇప్పటివరకు లారీల్లో దాన్ని తరలించలేకపోయా రు. దీంతో గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి పెద్దఎత్తున ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. వర్షం వచ్చినప్పుడల్లా అష్టకష్టాలు పడి తడిచిన బస్తాలు తిరిగేస్తున్నామని రైతులు వాపోతున్నారు. పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షాహిన్‌బేగంకు చెందిన వంద వడ్ల బస్తాలు కూడా ఇందులో ఉన్నాయి. ఆ వంద బస్తాలు కూడా తడిచి పోయాయి. మహేశ్వరరెడ్డి, శివారెడ్డి అనే రైతులకు చెందినవి కలుపుకుంటే గ్రామంలో 700 బస్తాల వడ్లు నిల్వ ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. బస్తాలపై టార్పాలిన్లు కప్పినా వర్షం దాటికి వాటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే లారీలను రప్పించి ధాన్యాన్ని తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రంలోని అవకతవకలపై ఫిర్యాదు

కోదండరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కుర్వ పల్లయ్య

అయిజ, జూన్ 13: మండలంలోని బైనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి, బా ధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వపల్లయ్య రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. బైనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఏపీ రాష్ట్రం నుంచి ధాన్యం తెచ్చి కొనుగోలు కేంద్రంలో విక్రయించారని, రైతులు ఆరోపించిన విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని వివరించారు. కొనుగోలు కేంద్రంపై సమగ్ర విచారణ చేసి, నిర్వాహకులతోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఏపీడీపై చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వనపర్తి టౌన్, జూన్ 13 : పెద్దమందడి మండల పంచాయతీ కార్యదర్శులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీడీపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ పెద్దమందడి, ఖిల్లాఘణపురం మండలంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సామూహిక ఓరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించగా మహిళా పంచాయతీ కార్యదర్శులను ఏకవచనంతో సంబోధిస్తూ వేషధారణ, కుటుంబ విషయాలను ప్రస్తావన చేస్తూ హేళన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కనీసం రెండు గంటలు కూడా పనిచేయడం లేదని అవమానకరంగా మాట్లాడారని, అన్ని అబద్ధాలు చెప్పున్నారని, మీకేం చేతకాదని చేబుతూ ఇబ్బందులకు గురిచేశారన్నారు. స్పెషల్ అధికారి కాలంలో ఆర్థిక పరమైన విధులను కూడా ఎన్నో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నామన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీడీపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేసినట్లు చెప్పా రు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

అమరచింత, జూన్ 13 : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన హరిజన్ ఉత్తమ్మ (75) అనే వృద్ధురాలు గ్రామ శివారులోని టీ కొట్టు వద్ద టీ తాగి బయటకు వస్తుండగా గ్రామానికి చెందిన రమేశ్ అనే యువకుడు తన బొలెరో వాహనంలో అమరచింతలోని రైస్‌మిల్లుకు వద్ద లోడ్‌తో వెళ్తుండగా టీ కొట్టు వద్ద ఉత్తమ్మ ఒక్కసారిగా వాహనానికి అడ్డుపడడంతో అప్రమత్తమైన డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనక టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కూతురు చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లుగా తెలిపారు.

యువకుడు అదృశ్యం

అలంపూర్ చౌరస్తా, జూన్ 13: పట్టణంలోని శుక్రవారం ఓ యువకుడు అదృశ్యమైన ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై శేఖర్ కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా తాండ్రపాడు గ్రామానికి చెందిన షబ్బీర్ బాషా మానవపాడు మండలం బోరవెల్లిలో తన భార్య రజియాబీ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఈ నెల 11వ తేదీన ఇంటినుంచి బయలుదేరాడు. కానీ గురువారం వరకు ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తన తండ్రి టైలర్ మహబూబ్‌బాషా బొరవెల్లిలో ఉన్న కోడలిని, బంధువుల ఇండ్లల్లో విచారించిన రాలేదని చెప్పడంతో శుక్రవారం ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వనపర్తిలో వ్యక్తి..

వనపర్తి టౌన్, జూన్ 13: జిల్లా కేంద్రంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ కథనం ప్రకారం పీపనగండ్ల మండలం సంపత్రావుపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కు జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీకి చెందని ఉమారాణితో రెండేండ్ల కిందట పెండ్లి అయ్యింది. కాగా ఈనెల 10న భార్యాభర్తల మధ్య గొడవలు కాగా ఆరోజు సాయంత్రం 5:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి నవీన్ తిరిగి రాలేదని, ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని భార్య ఉమారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్ల చెరువులో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన హుస్సేన్ (65) మానసిక స్థితి సరిగ్గా లేనందున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి నల్ల చెరువులో చేపలు పడుతూ రెండురోజులకు ఒకసారి ఇంటికి వచ్చేవాడని, ఈ నెల 11న మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. శుక్రవారం నల్ల చెరువులో గుర్తు తెలియని శవం ఉందని పోలీసులకు సమాచారం రాగా ఘటనా స్థలానికి వెళ్లి చూడగా శవాన్ని వెలికితీయగా హుస్సేన్ భార్య సిషిమున్నాబేగం మృతదేహం తన భర్తదేనని గుర్తించింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులపై కేసులు

మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేసి పట్టుబడితే వారి తల్లిదండ్రులు, పిల్లలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి బండారు శ్రీలత హెచ్చరించారు. శుక్రవారం వనపర్తి జిల్లాలో వనపర్తి టౌన్, కొత్తకోట, ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడిన 8మంది మైనర్లను వారి తల్లిదండ్రులను కోర్టులో హాజరుపరుచగా జడ్జి కౌన్సిలింగ్ నిర్వహించారు.

17న రజకుల మహాధర్నా

వనపర్తి టౌన్, జూన్ 13 : రజక, నాయీ బ్రాహ్మణ సేవా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య మాట్లాడుతూ రజక, నాయీబ్రాహ్మణ వృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాధర్నాను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం నాయకులు విజయ్, చంద్రశేఖర్, శ్యాంప్రసాద్, కృష్ణయ్య, గోవిందు, రమేశ్‌బాబు, మహేందర్, సత్య నారాయణ ,బాలస్వామి, ఆంజనేయులు, శ్రీనివాసులు ఉన్నారు.

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

కొత్తకోటలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూన్ 13 : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని బీపీఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద లబ్ధిదారులకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని మిరాసిపల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలోని వడ్డెర, యాదవ, కుర్వ సం ఘాల పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మిరాసిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫార్స్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే కొత్తకోట పట్టణంలో నూతనంగా నిర్మించే 30 పడకల దవాఖానకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.5.75 కోట్లు ఖర్చు పెట్టి దవాఖానను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రవీందర్, మార్కెట్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, బీచుపల్లి యాదవ్, మేస్త్రీ శ్రీను, పీజే.బాబు, కృష్ణారెడ్డి, ఎన్.జే.బోయే జ్, గోకరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

పెబ్బేరు మండలంలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోస్తున్న ఎమ్మెల్యే

పెబ్బేరు, జూన్ 13: తమ ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి తీరుస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవా లు, శంకుస్థాపనలు నిర్వహించారు. బడిబాట, అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్లను మంజూరి చేస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమోదిని, వైస్‌చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పిల్లలను చేర్పించాలి

అమరచింత, జూన్ 13 : మూడేండ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ అమరచింత మండల సూపర్ వైజర్ నర్మద సూచించారు. మండలకేంద్రంతోపాటు, మండలంలోని నాగల్‌కడ్మూర్ అంగన్‌వాడీ కేంద్రంల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో అంగన్‌వాడి టీచర్లు ఆయాలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పిస్తే వారికి ఆటపాటలతోపాటు విద్యాబుద్ధులు నేర్పిస్తామన్నారు. అనంతరం మొదటిసారిగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులకు ఆమె టీచర్లతో కలిసి పూలను ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీచర్లు నాగేంద్రమ్మ, వజ్రమ్మ, వెంకటేశ్వరమ్మ ఉన్నారు.

పెద్దతండాలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో సురేశ్

పాఠశాలలో అక్షరాభ్యాసం

పెద్దమందడి, జూన్ 13 : మండలంలోని మోజర్ల-మద్దిగట్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం వరప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొత్త పలక, బలపం ఇచ్చి అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ గెజిటెడ్ హెచ్‌ఎం వరప్రసాదరావు, సీనియర్ ఉపాధ్యాయులు రణదీవ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరాజు, రమేశ్, విష్ణు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

మల్దకల్, జూన్ 13 : మండలంలోని పెద్దతండా ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో సురేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నుంచి వచ్చిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించగా ఎంఈవో ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. అలాగే విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరేశ్‌బాబు, జగదీశ్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సద్దలోనిపల్లిప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం నల్లన్న ఆధ్వర్యంలో పాఠశాలలో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్‌లో నీటినిల్వ ఉన్న తొట్లను పరిశీలిస్తున్న డాక్టర్ సాయినాథ్‌రెడ్డి

పాన్‌గల్, జూన్13: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా వ్యాధి నిర్మూలన ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో పలు వీధు ల్లో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి విష జ్వరాల బారినపడే అవకాశం ఉందని తెలిపారు. పరిసరాల్లో ఉండే టైర్లు, కుండీల కవర్లలో నీటిని నిల్వ చేయవద్దని, లేకపోతే దోమల వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఆరోగ్యఅధికారి చంద్రశేఖర్, వైద్య సిబ్బంది రాంచందర్, నర్సమ్మ, నాగేశ్వరీ, శైలజ, పంచాయితీ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

మోజర్ల ఉద్యాన కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

పెద్దమందడి, జూన్ 13 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని మోజర్ల, కొల్లాపూర్‌లో ఉన్న కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాలలో చదివేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ సైదయ్య తెలిపారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిదాయలయంలో రెండేండ్ల ఉద్యాన డిప్లొమా కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన చెప్పారు. మొత్తం 200సీట్లు ఉంటే ఉద్యాన విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్‌లు ఆదిలాబాద్, రామగిరికిల్లా, కొల్లాపూర్ ఉద్యాన కళాశాలల్లో 40చొప్పున ఇంటెక్ కెపాసిటీ ఉందని చెప్పారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఇప్పటికే ఆప్లికేషన్లు తీసుకుంటుందని, అప్లికేషన్లు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 28 చివరి తేది అని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్ 2025 లేదా పదో తరగతి పాసైన వాళ్లు, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు డిప్లొమాకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పాలిసెట్ 2025 ర్యాంకు లేదా సమానమైన పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా విద్యార్థులు అడ్మిషన్లు ఉంటాయని ఆయన తెలిపారు. డిసెంబర్ 31, 2025 నాటికి కనీసం 15ఏండ్లు, గరిష్ఠంగా 22 ఏండ్ల వయసు కలిగి ఉండాలని, 60శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం నాలుగేండ్లు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారు.

ఉపాధి అవకాశాలు మెండు

ఉద్యాన డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య చెప్పారు. ఉద్యాన పంటల విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యం, ఉద్యాన ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో, భవిష్యత్‌లో శిక్షణ పొందిన ఉద్యాన మానవ వనరులకు మేలైన ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. నర్సరీ మొదలుకొని చీడపీడల యాజమాన్యం, ఉద్యాన పంటల శాస్త్రీయ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలలో మెళకువలు అలాగే పంట కోత విలువల జోడింపు వంటి అంశాలపై విద్యార్థులకు డిప్లొమాలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. రెండేండ్ల ఉద్యాన డిప్లొమాల పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యాన పరిశ్రమలు, ఆయిల్ పాం పరిశ్రమలతోపాటు అనేక విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో హార్టి సెట్ ద్వారా సీటు సంపాదించవచ్చన్నారు. విత్తన, పురుగుల మందు, ఎరువుల కంపెనీల్లో అనేక ఉపాధి కొటేషన్స్ అవకాశాలు ఉంటాయని ఆయన సూచించారు.

క్రీడా పాఠశాలల ప్రవేశానికి ఎంపికలు

వనపర్తి టౌన్, జూన్ 13 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ నాలుగో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన , క్రీడల శాఖ అధికారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

మూడు అంచెల్లో ఎంపిక ప్రక్రియ..

హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందని , జూన్ 16 నుంచి 19వ తేదీ వరకు మండలస్థాయిలో నిర్వహిస్తారని , జిల్లాస్థాయిలో ఈనెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో జూలై 1 నుంచి 5వ తేదీ వరకు హకీంపేటలో నిర్వహిస్తారని తెలిపారు. హకీంపేటలో బాలురకు 20, బాలికలకు 20సీట్లు, కరీంనగర్‌లో బాలురు 20, బాలికలకు 20 సీట్లు, అదిలాబాద్‌లో బాలురకు 20, బాలికలకు 20 సీట్లు మొత్తం 120 సీట్లకు ఈ ఎంపిక జరుగుతుందని చెప్పారు. 20 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్లు, 6*10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు, ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈఎంపికలకు సెప్టెంబర్ 1, 2016 నుంచి ఆగస్టు 30, 2017 మధ్య జన్మించి 8 నుంచి 9ఏండ్ల వయసు కలిగిన నాలుగో తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమైందని, ఈ నెల 15న చివరి తేదీ అని చె ప్పారు. విద్యార్థులు tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని వివరాల కోసం జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారిని సంప్రదించాలన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, జూన్ 13 : లోక్ అదాలత్‌తోనే సత్వర న్యాయం జరుగుతుందని, ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ శుక్రవారం ప్రకటనలో అన్నారు. వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయని, ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే అప్పుడే సమసిపోతాయని, జిల్లాలో వివిధ రకాల రాజీపడదగే కేసులు కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని అన్నారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 14వ తేది శనివారం వనపర్తి జిల్లా కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని చెప్పారు. యాక్సిడెంట్ , కొట్టుకున్న , చీటింగ్ కేసులు, వివాహబంధానికి సంబంధించిన కేసులు , చిన్న చిన్న దొంగతనం కేసులు, డ్రంకె న్ డ్రైవ్ , ఇతర రాజీపడదగిన కేసులను ఈ నేషనల్ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొని క్లోజ్ చేసుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దీనికోసం ఫిర్యాదుదారుడు, నేరస్తులు తమ యొక్క ఆధార్‌కార్డు తీసుకొని సంబంధిత కోర్ట్ ప్రదేశంలో హాజరుకావాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా బాధితులకు మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజయ్‌కుమార్ అరెస్ట్ బాధాకరం

గట్టు, జూన్ 13 : సీడ్‌పత్తి రైతులకు న్యాయం చేయాలని రైతు కమిషన్ వద్దకు వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకుడు కుర్వ విజయ్‌కుమార్‌ను అకారణంగా అరెస్ట్ చేయడం బాధాకరమని బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు అంగడి బస్వరాజు శుక్రవారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సీడ్‌పత్తి ఆర్గనైజర్లు వాస్తవాలు చెప్పకుండా కమిషన్‌ను తప్పుదారి పట్టించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేయాలని వెళ్లిన విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని బస్వరాజ్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వనపర్తి టౌన్, జూన్ 13: వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాజాగౌడ్ తెలిపారు. జిల్లాకేంద్రంలో 33/11 కేవీ ఫీడర్‌లో మరమ్మతు కోసం ఉదయం 7నుంచి 9గంటల వరకు అంతరాయం ఉంటుందని, జిల్లా కేంద్రంలోని బాలనగర్, పాత బజారు, కుమ్మరి గేరి , కమలానగర్, గాంధీనగర్, రాయిగడ్డ, రాంనగర్ కాలనీ, బ్రహ్మంగారి వీధి, శారదనగర్, శ్వేతనగర్, తిరుమల కాలనీ, వల్లభ్‌నగర్, పోలీస్ క్వార్టర్స్, పీర్లగుట్ట, డీఎస్పీ ఆఫీస్ బండారు నగర్, పాన్‌గల్ రోడ్డు, భగత్‌సింగ్ నగర్, మెట్టుపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUILDING CONSTRUCTION
★ Mahabubnagar పాత జిల్లాలో ఇండివిజువల్ ఇల్లు, హాస్పిటల్ బిల్డింగ్, కమర్షియల్ బిల్డింగ్ కట్టుకోవాలనుకునే వారికి మేము పూర్తిగా 100% క్వాలిటీతో మీ కలలను సాకారపరుస్తు అద్భుతంగా నిర్మించి ఇవ్వగలం. Brick & Bond Home Constructions. Contact Cell Nos : 7013510429, 9160069191.
NT-MBNR

FLAT FOR SALE
★ Mahabubnagar టౌన్లో కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK మరియు 3BHK Flats అమ్మకానికి కలవు. Ready to occupy, 90% హౌసింగ్ లోన్ ఫెసిలిటి, False Celling, లిఫ్ట్, జనరేటర్ మరియు 24 గంటలు CC కెమెరా సౌకర్యం కలదు. SS Constructions. Contact Cell Nos : 7013510429, 9441382770.
NT-MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748